లంకాదహనం

ఎ వి సీతారామమూర్తి

'గవర్నమెంటోళ్ళు ప్రొహిబిషన్నెత్తేశాక నువ్వు బతికి బాగుపడ్డావులే గంగన్నా. ఇన్నాళ్లా ఎంత సంపాదన్నా దొంగ చాటేపారమే గందా— దన నాయాల్లు తాగిన పెతివోడో పోలీసాడినే లెక్క చెయ్యకుండా కారుకూతలు కూయడం, పట్టుబడ్డం, నీ కొంప మీదికి తేడం, వారానికి ఒకటో రెండో సార్లు ఆ పోలీసోళ్లను తడిపే సరికి నీ లాబాలు గూబల్లో కొచ్చేవి— పోన్లే నీ అదురుష్టం బావుంది–నీయాపారం నిలిఏంది. మాకూ యీ బయాలు పోనాయి– యేదీ మరో గ్లాసందుకో...'' అంటూ తాగి ఖాళీ చేసిన గ్లాసును కర్ర టేబిల్ మీద పెట్టి ఆవులించాడు జోగులు.

గంగన్నకీ రకం సానుభూతి మాటలు రోజూ అలవాటై పోయాయి ఓ గ్లాసేసు కున్న ప్రతి వాడూ తనను గురించి మాటాడతాడు. అంతే—అంత వరకే రెండో గ్లాసెక్కిందా! ఆపలేం - వాళ్ళ మాటలు, వాళ్ళ పాటలు, వాళ్ళ లోకమే వేరు

నింపిన గ్లాసును మళ్ళీ నిముషంలో ఖాళీ చేసి నిషాలోకి దిగి జోగుతూ యింటి దారి పట్టాడు జోగులు

నిండుగా ఊపిరి పీల్చుకొని గల్లాపెట్టి కన్నార్పకుండా చూశాడు. గూట్లోని దీపం బుడ్డి లేత కాంతులు ఆమె ముఖంలోని అమాయికతను వ్యక్తం చేస్తున్నాయి

లోపలున్న నులక మంచం కొట్లో వేసుకుని, దుప్పటి పరచుకుని కూర్చున్నాడు గంగన్న బేరం సన్నగిల్లి పోయినట్టే అనుకొని కొట్లోని పెద్దలైటు చిన్నది చేసి, తలుపు మూసి, నడుం వాల్చాడు

ఎంత వద్దనుకున్నా రత్తాలి రూపం తన కళ్ళలో అలానే నిల్చిపోయింది— లోకమంటే ఏమిటో పూర్తిగా తెలియకుండానే 'మందు' సామాను వాసనను అసహ్యించుకునేది రత్తాలు చిన్నారి రత్తాలు గౌన్లు తొడిగే వయసులోనే తల్లిని పోగొట్టుకుంది

పుణ్యస్థలి అరాచకాలతోనే పావనమౌతూ వుంటుందా? అమాయకులు దైవత్వాన్ని పొందటం-కిరాతకుల కబంధ హస్తాల్లోనలిగిపోవటమేనా?

ముందు నించి లేచాడు గంగన్న రాత్రి పది దాటినట్లుంది అక్కడక్కడ సద్దు మణిగినా వూరింకా పూర్తిగా నిద్దరోలేదు తాగినవాడి కళ్ళలా ఎర్రగా మత్తులో మునిగి తేల్తోంది

పెట్టెలోని డబ్బంతా మరోసారి లెక్క చూసుకుని లోపలికి నడిచాడు గంగన్న నులకమంచంమీద రత్తాలు నిద్దరోతోంది ఎర్రటి మందార పువ్వుల పరికిణీ, తెల్ల వాయిల్ వోణీ-చింతపూవుల జాకెట్టు యౌవ్వనం తొలి దశలోకి అడుగుపెట్టిన కూతురి వంక ఒక్క నిముషం అలా

కనకం పోయాకనే తనలో మార్పు వచ్చింది రత్తాలు తనకు ప్రాణమై పోయింది అంతే-కనకం ఆశించినవన్నీ రత్తాలు అమలు జరిపింది.

'రత్తాలకి యేడాదిలో పెళ్ళి చేయాలి' అనుకున్నాడు గంగన్న. ఈమధ్య ప్రొహిబిషన్ ఎత్తేశాక నిజంగా తన యాపారం బాగానే జరుగుతూంది

"దీపముండగానే యిల్లు చక్కబెట్టు కోవాలన్నట్లు నాలుగు రాళ్ళు వస్తున్నపుడే రత్తాలినో యింటిదాన్ని చేస్తే బరువు తీరుద్ది ఆ లోకాన్నున్న కనకం సంతో షిస్తుంది.

నిజానికి రత్తాలికీ యాపారమంటేనే కిట్టదు. ఈ వృత్తి కంటే ఏ కూలో చేసు కుంటే నయం-అంటుంది. ఇంకా పిన్న తనం - పెపంచకం బాగా తెలీదు. ఈ గొప్పోళ్ళు, వూరూరా తిరిగి సందాలు పోగు సేసి, బీదోళ్ళ పేర్లు సెప్పి తమ పేణాల్ని సుఖపెట్టుకునే వారు, దేవుడి పేరెట్టి జనాన్ని నిలువునా మోసం చేసే వోళ్ళు, సీకటి బజార్లో సేతులు సాపి మేడలు కట్టే మొనగాళ్ళు, సత్తె పెమా ణాలు సేసి మొగం సాటు సేసే పెద్ద మడుసులు, కొల్లలుగా పిల్లలు లేని గోదారి ప్రవాహంలా లోకమంతా నిండి వున్నా రనీ, అందులో తను చేసే పనేం తప్పు కాదని, పాపం పదహారేళ్ళు నిండీ నిండని రత్తాలుకేం తెల్సు?"

సూరమ్మక్క కొడుకు రాజులుకి రత్నా ల్నిస్తే బావుంటుందని కొన్నాళ్ళుగా అను కుంటున్నాడు.

ఆడికీ ఓ పిన్న నౌకిరీ, వుండేందుకో గూడూ వున్నాయి మంచి వాకు లాంటోడు. ఆడి పేరెత్తితేనే రత్తాలు తెగ సిగ్గు పడుతుంది

తను మాత్రం తక్కువ సేత్తాడా! ఒక్కగా నొక్క బిడ్డ-తల్లి లేనిది తన సంపాదనంతా యింక అనుభవించే దెవరు? ఆళ్ళిద్దరూ పిలకా గోరింకల్లా కళ్ళముందు కళ-కళ్ళాడుతూంటే అన్నీ తీరిన యీ వయసులో యింకేం కావాలి తనకు?

గంగన్న ఆలోచనలు సగంలోనే ఆగి పోయాయి ఎవరో దబదబ తలుపు తట్టిన శబ్దమయింది

లేచి తలుపు తీశాడు తన యాపా రానికి యీ రకమైన అర్ధరాత్రి పిలుపులు అలవాటే!

"గంగన్నాయ్! పెద్ద బుడ్డీ ఓటి కావాల—మాంచి బేరమొచ్చింది " అంటూ తెచ్చిన నోట్లు చేతిలో పెట్టి, అక్కడే నించున్నాడు నాయుడు

నాయుడీ రకమైన సహాయాలు పెద్ద-పెద్దోళ్ళకు చేసిపెట్టడం, ఆళ్ళ గుట్లన్నీ తన గుప్పెట్లో పెట్టుకోవడం-చిన్నతనం నుంచీ అలవాటే! విశేషమేమిటంటే అందరిచేతా తాగించే నాయుడు మాత్రం ఎప్పుడోగాని తాగడు

అనుకోకుండా నాయుడి కళ్ళు రత్తాలు మీద పడ్డాయి ఆ చిన్ని వెలుగులో రత్తాలు అందాల జాబిల్లి ముక్కల్లా కన్పించింది నలభై యేళ్ళ నాయుడు చప్పున ముప్పై ఏళ్ళకు కుంగిపోయి కలలు గనే లోపునే గంగన్న బుడ్డీ చేతికందించాడు నాయుడి చూపుల అర్ధాన్ని గ్రహించలేక పోలేదు గంగన్న

"గంగన్నోయ్! రత్తాలు పెల్లి కెదిగింది సుమా! సువ్వూరుకున్నావో ఆనకెవడో ఎగరేసుకు పోగల్డు—సక్కదనాల సుక్క గదా మరి ."

నాయుడి పేలాపనకు ఎక్కడలేని కోపం ముంచుకొచ్చింది. అమాంతంగా వాణ్ణి బయటకు తోసి, తలుపు మూసి గడియ పెట్టాడు.

ఎదవ నాయాల-పున్నానికీ, అమాశకీ సుక్కేసుకుంటే యిలాటి పేలాపనలే

'హుం రత్తాలంటే యేటనుకున్నాడో! రతనం—మానిక్యం—దేవత పెట్టుకునే పారిజాతం ' అనుకుంటూ ఆనందంతో కూతురి వైపు ప్రేమగా చూశాడు.

ఊరంతా పూర్తిగా మాటు మణిగి పోయింది. నిశ్శబ్ద వాతావరణాన్ని లొంగదీస్తూ సముద్రం ఘోష పెడుతోంది వీధిలైట్లు అక్కడక్కడ మినుక్-మినుక్ మంటున్నాయి. ప్రజలంతా నిద్ర మైకంలో మందు నిషాలో మునిగిపోయారు

* • *

ఎర్ర చొక్కా వేసుకుని మోకాళ్ళ నీళ్ళలో ఆడుకుంటున్న పసివాడిలా దినకరుడు ఎర్రగా-అందంగా సముద్రపు ఆవలి అంచున కన్పించాడు. అటువంటి దృశ్యాన్ని రత్తాలు అదే పనిగా కన్నార్పకుండా చూస్తుంది తెల్లటి స్వచ్ఛమైన యిసుకను సముద్రుడు ముద్దాడుకుంటూ వెళ్ళిపోతున్నాడు. ప్రకృతంతా శాంతంగా మనోహరంగా వుంది

సముద్రపు ఒడ్డుపై యింకా అలా దృష్టి సారిస్తున్న రత్తాలి చూపులు ఆగిపోయాయి రోజూ చూసే చిన్న పడవలు, జాలరి వలలు అక్కడ లేవు. బేస్తలంతా దూరంగా గుమిగూడి వున్నారు. ఆ ప్రదేశమంతా పరిశుభ్రం చేస్తున్నారు.

అకస్మాత్తుగా రత్తాలి మనసులో సంతోష రేఖలు తొంగి చూశాయి

శ్రీరామనవమి యింకా తొమ్మిది రోజులుంది ఏటా శ్రీరామనవమికి ముందు తొమ్మిది రోజులూ వూరంతా వుత్సవాలు జరుగుతాయి ఏ రోడ్డు చూసినా—ఏ మూల చూసినా రామనామ జపమే రామనామ

"మీరెంతవరకు చదివారు?"

"అరవై ఏళ్ళ ముందు ఆరవ తరగతి అయినా బి ఏ. చదివినవాడినైనా యింగ్లీషులో పడెయ్యగలను

—టి. యస్. మోహన్ బాబు, తిరుపతి



సంకీర్తనే భజనలే ..రాత్రులు హరి కథలు, బుర్ర కథలు, నాటకాలు, యథా విధిగా ప్రతి రోజూ జరిగి తీరాలి . వచ్చినవారందరికీ ప్రసాదాలు పంచి పెడ తారు. వాటికయ్యే ఖర్చంతా ఆ శ్రీరామ చంద్రుడిదే . . వేల కొలది రూపాయలు చందాల రూపంలో వసూలవుతాయి.

నవమి నాడు సముద్రపు ఒడ్డున 'లంకా దహనం' జరుగుతుంది.

లంక పేరుతో ఓ పెద్ద తడికల సౌధాన్ని నిర్మిస్తారు. దూరంగా అశోక వృక్షం!

నవమి నాటి—అర్ధ రాత్రివేళ హను మంతుడు వుగ్రరూపం దాల్చి సీతాదేవిని చెరనుండి విడిపించి-లంక తుద ముట్టించి సముద్రంలో తోక నిప్పు ఆర్పుకుం టాడు.

ఎక్కడలేని ప్రజలంతా ఆ తొమ్మిది రోజులూ వచ్చి చేరుతారు. ఆ సంబరాలూ వుత్సవాలూ చూసి తీరాల్సిందే!

రత్తాలికివన్నీ తల్చుకుంటే ఎంతో ఆనందమనిపించింది. లంక కట్టేందుకు పని కూడా మొదలయింది.

* * *

ఆ రోజే శ్రీరామనవమి....సముద్రపు ఒడ్డంతా యిసకేస్తే రాలనట్లుగా జనం పరుచుకున్నారు. ఎక్కడ చూసినా జన సమూహమే!

సాయంకాలమయ్యేసరికే వంటపనంతా పూర్తిచేసి తండ్రినడిగి సంబరాలు చూడ్డానికి మరికొంత మందిని తీసుకుని బయల్దేరింది రత్తాలు

చీకటి పడుతూన్నకొద్దీ మంది బేరాలు మరింత ఎక్కువయ్యాయి

ప్రతి నాల్గు రోడ్ల జంక్షను దగ్గరా పందిళ్లు వేసి స్టేజిలు కట్టారు స్టేజికెదురుగా దేముడు—ఎక్కడ చూసినా జనం లెక్కలేకుండా వున్నారు

ఒకచోట రికార్డింగు డ్యాన్సు జరుగుతోంది. నిండుగా పదహారేళ్లు దాటని ఆడపిల్లా, పాతికేళ్లు దాటని అబ్బాయీ సినీమా పాటలను అనుకరిస్తూ డ్యాన్సు చేస్తున్నారు

నైలాను ఓణీ, సగం ఒళ్లు కనిపించే జాకెట్టు పువ్వుల పొట్టి లంగాతో ఆ పిల్ల గెంతుతూంటే విచ్చల విడిగా అందరి మధ్యా అ పిల్లను అక్కున జేర్చుకుంటూ రీవిగా డాన్సనే పేరుతో ఒళ్లు విరుచుకుంటున్నాడా అబ్బాయి

దేముడి కెదురుగా యిటువంటి పనులు చేయటం యీ రోజుల్లో తప్పుగా పరిగణించబడదు పైగా బైరో భజనలూ, రామనామ సంకీర్తనలూ జరపటం చిన్నతనంగానూ, తక్కువగానూ భావిస్తున్నారు.

ఎగిరి గంతులేసే ఆ పిల్లను చూసి, జనం విరగబడి ఈలలేసి తప్పట్లు కొట్టి, నానా భంగిమల్లో ఆమెను చిత్రించుకుని ఆనందిస్తున్నారు.

రోడ్ల మీదకూడా మగాళ్ళు ఆడవేషం వేసుకుని షో డాన్సులు చేస్తున్నారు ఎక్కడ చూసినా పులివేషాలు—

ఒకటి-రెండు చోట్ల తప్పితే అన్ని చోట్లా రికార్డింగు డాన్సులే జరుగుతున్నాయి

రత్తాలికి అవి చూడ్డం అట్టే మనస్కరించలేదు అవి చూస్తూన్న జనం ఉద్రేకంతో ఆశవార్ని చూసి మీద పడుతున్నారు

ఇంటికొచ్చి తనింత అన్నం తిని అయ్యకింత పెట్టి మంచం మీద నడుం వాల్చిందో లేదో నాయుళ్ళ పిల్ల సుబ్బులు ఓ పది మందిని తీసుకు వచ్చింది లంకా దహనం చూసే ఏర్పాటుతో

రత్తాలు మళ్ళీ వుత్సాహాన్ని పుంజుకుంది. ఓ మూల భయం ఆవరించినా కూతురి యిష్టాన్ని కాదనలేక పోయాడు గంగన్న.

అర్ధ రాత్రి గడిచేసరికి వూళ్లో అన్ని సంబరాలూ ముగిసిపోయాయి. జనమంతా సముద్ర తీరానికి చేరుకున్నారు. లంక దేదీప్యమానంగా వెలిగి పోతూంది కొద్ది దూరంలో అశోక వృక్షం క్రింద సీత దిగాలు పడివుంది. ఆంజనేయులు అంగుళి

చూపించి తనను తాను రామదూతగా పరిచయం చేసుకున్నాడు ఆ తర్వాత లంకను తుదముట్టించడమే ధ్యేయమన్నట్లు తోకకు నిప్పంటించుకుని చెట్టుకు, కోటకు కట్టిన వైర్ ద్వారా గాలిలో ఎగిరాడు.

అప్పుడే కిటకిట లాడుతూన్న జనం మధ్య తోపుడు ప్రారంభమైంది స్త్రీలకై ప్రత్యేకింపబడిన స్థలం యొక్క అడ్డ కర్రలు కిరకిర లాడి విరిగి పోయాయి మహాసముద్రంలా జనం ఎటుబడితే అటు విరుచుకు పడుతున్నారు ఆధారం లేక గాలివాటుగా ఎటో పోతున్నారు

నలుగురి మధ్యా విల్చుని ఆనందంగా దృశ్యాన్నంతా చూస్తున్న రత్తాలు అనుకోని తోపుకు తుళ్ళి ప్రక్కకు ఒరిగి పోయింది

ఆంజనేయుడు లంకను తుద ముట్టించాడు మంటలు రేగాయి. జనంలో కలకలం మరింత హెచ్చింది

అవకాశంకోసం వేచియున్న కొందరు పురుషులు స్త్రీలపై బడ్డారు! ఎవరూ ఎదిరించలేని పరిస్థితి అందరిలోనూ ఏర్పడింది. అబలలకూ-బలవంతులకూ మధ్య పెనుగులాట—నీతికీ, అవినీతికీ మధ్య సంఘర్షణ! మానవత్వం మా నా న్ని కోల్పోయే దుస్సంఘటన—

అంతే! దేముడిపేరు చెప్పుకుని మడి గట్టుకున్నామని చెప్పే నీతిపరులందరూ నిగ్రహాలను సడలించుకుని తమలో పేరుకుని పడగలెత్తే కోరికతో పరుగులెత్తారు.

అందిన స్త్రీని అనుభవించారు!!

జన సమూహంలో మరింత కలవరం బయలుదేరింది ఒకవైపు పోలీసులు లాఠీలతో విజృంభించారు

అసహజపు లంక కాలి బూడిదగా మారుతోంది—అవినీతి పరులలో మండి ఆరిన కోరికల్లా

జనమంతా పాయలు-పాయలుగా విడిపోయి యిళ్ళ దారి పట్టారు ఎవరి సంతోషం వారిది! ఎవరి తృప్తి వారిది! ఎవరి బాధ వారిది! ఎవరి భయం వారిది!!

కొద్ది సేపటిలోనే ఆ ప్రదేశమంతా ఇంచుమించు ఖాళీ అయిపోయింది.

కానీ—

ఒక ఇసిక తిన్నెమీద నలిగిన చీరతో నిర్జీవంగా ఆకాశం వంక చూస్తూంది ఒకామె ఆమె వేసుకున్న బాడీ అక్క-

---

సబ్ యిన్స్పెక్టర్ దొంగతో ఇప్పటికి ఎన్ని దొంగతనాలు చేశావ్?

దొంగ ఒకటి సూపరింటెంట్ గారింట్లో, రెండవది సర్కిల్ యిన్స్పెక్టర్ గారింట్లో, మూడవది మీ యింట్లో, నాల్గవది జవానుబాబుగారింట్లో!

—టి. యస్. మోహన్ బాబు, తిరుపతి

దక్కడ చిరిగి రక్తం చిమ్ముతూన్న కొన్ని భాగాలు కన్పిస్తున్నాయి ఆమె ముఖం మీద-మెడ మీద కూడా రక్కులు బలంగా వున్నాయి.

ఆమె కళ్ళలో జీవం లేదు——

ఆమెలో చైతన్యం లేదు——

ఆమెను కాపాడగలిగిన వారూ లేరు—

ఆమె రత్తాలు!!

ఆమె చుట్టూ పోలీసులు మూగి వున్నా జీవం లేని ఆమె కళేబరాన్ని కాపాడేందుకు——ఎవరికి తోచిన పని వారు త్వర-త్వరగా చేసుకు పోతున్నారు ఆమె నీ స్థితికి తెచ్చిన మహనీయులందరికీ శిక్షలు పడేవరకూ తాము నిదుర పోమన్నారు కొందరు.

కాని వారి సానుభూతికీ, ఉపకారానికీ అతీతురాలైన రత్తాలు నిశ్చలంగా పడి వుంది-నింగీ నేలకు మధ్య.

విషయం తెల్సిన గంగన్న పరుగెత్తు కొచ్చాడు. రత్తాలినలా చూసేసరికి నిలు వునా కూలిపోయాడు

'రత్తాలూ!' అంటూ అతను వేసిన గావుకేక సముద్రపు హోరులో కలిసి పోయింది.

రత్తాలు దేముడి సమక్షంలో అన్యాయానికి ఆహుతై పోయింది. పెళ్ళి కాని రత్తాలులోని కోర్కె సుకుమారానికి నోచు లేక పోయింది. ప్రాణం కోసం కాక మానం కోసం పోరాడి, ఓడి ఆహుతై పోయింది రత్తాలు.

కొన్ని గంటల క్రితం పవిత్రమయిన ఆ స్థలం అపవిత్రమై విషాదంగా మారి పోయింది.

కళ్ళారా చూసిన ఘోరానికి దేము డంతటి సముద్రుడుకూడా సాక్షిగా విలువ లేక బావురుమన్నాడు

అంత దుఃఖంలోనూ గంగన్నలో కోపం అవధులు దాటింది. తన కన్న కూతుర్ని అన్యాయం చేసిన దుర్మార్గుల అంతం చూద్దామనుకున్నాడు ఉన్నపాటున వారిని పట్టి పొడిచి రక్తపు మడుగుల్లో వాళ్ళు తేలుతూ వుంటే చూసి ఆనందించా లనుకున్నాడు.

'కాని——ఈ అన్యాయం జరగటానికి కారణం వాళ్ళు కాదు-నేను న్యాయాన నేనే ' అనుకున్నాడు గంగన్న తన లోనే-పెద్దగా!

రక్తవర్ణమయిన అతని కళ్ళ ముందు గతమంతా భయంకరంగా పురి విప్పింది.

పాతిక సంవత్సరాల క్రిందట

ఇదే పండుగ-ఇదే రోజు

లంకాదహనం సంబరంలోనే——

గంగన్నలోని కోరిక కొండంతైంది. అతని కళ్ళలో వాంఛ తీవ్రరూపం దాల్చింది.

అంతే! అతని మనసు మంచీ చెడుల విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయింది

దూరంగా చీకట్లో కన్పించిన స్త్రీమీదకు పురుషత్వం విరుచుకు పడింది-సింహంలా ఘర్జించాడు తన బాహుబలాన్ని ఉపయోగించి వశపరుచుకున్నాడు తనివి తీర్చుకున్నాడు

కానీ ఆమె-తనను వదల్లేదు! ఆమె బిగిసిన పిడికిట్లో తన వస్త్రం యిరుక్కుంది తను విడిపించుకోటానికి విశ్వ ప్రయత్నం చేశాడు కానీ ఆమె-తన పట్టు వదల్లేదు—దూరంగా జనం!

ఆమె కేక వారికందింది ఇద్దరిమధ్యా పెనుగులాట—అర్ధ నగ్నపు శరీరాలతో. అక్కడక్కడ చిమ్మిన నెత్తురు మరకలతో

దూరంగా పోలీసుల గుంపు - శాంతి రక్షణకోసం నలువైపులా ఆక్రమించుకుంటున్నారు-చెవులు చిల్లులుపడే యీలల ఘోష!!

అంతే! గంగన్న తన శక్తినంతా కూడా దీసుకుని ఒక్కతోపు తోశాడు—

ఆమె దూరంగా కెరటాలదగ్గరగా పడిపోయింది- పడిన మనిషి మరి లేవలేదు-దగ్గర కెళ్ళి చూశాడు-ఆమెలో చైతన్యం లేదు-తను చేసిన పనికి ఉరిశిక్ష పడొచ్చు అని భయపడ్డాడు- పోలీసులు పసిగట్టేస్తే -ఇంకేముంది?

అతని శరీరంలో ప్రతి అణువూ వణికింది- వళ్ళంతా చెమటతో ముద్దయింది-

అతని ఆలోచనలు పరిపరి విధాల పోయాయి-

అంతే! అత నేం చేయాలనుకున్నాడో యేం చేశాడో అంతా అరక్షణంలో జరిగిపోయింది.

ఎవరికంటా పడకుండానే ఆమెను సముద్రుడి కర్పించి ఖారంగా అడుగు లేస్తూ గుంపులో కలిసిపోయాడు- తెల్లవారకముందే వూరి పొలిమేరలు కూడ దాటిపోయాడు-

మళ్ళీ ఆరేళ్ళ తర్వాతనే కనకంతో సహా అడుగుపెట్టాడు ఎవరూ అనుమానించకపోయినా తను చేసిన తప్పుకు మనసులోనే పశ్చాత్తాపపడ్డాడు- కనకం తన బాధనూ, పేదరికాన్నీ కూడ దూరం చేసింది - సంసారాన్ని ఓ స్థితికి తీసుకొచ్చింది.

* * *

గతంలోంచి చూపులు మళ్ళించి చూసేసరికి గంగన్న చుట్టూ కొద్దిపాటి జనం కూడారు - సముద్రఘోష తప్పితే అంతా నిశబ్దంగా వుంది-

దూరంనుండి చిన్న వెలుగు రత్తాలి ముఖంమీద లీలగా పడుతోంది!

ఆ నాడు తను చేసిన పాపానికి



ప్రాయశ్చిత్తం ఆ దేముడే విధించాడు- తనకళ్ళముందే కన్న కూతురు అన్యాయానికి ఎర అయిపోయింది!

అతని కళ్ళలో ఆ నాటి "ఆమె" ఆవేదన, కంగారూ స్పష్టంగా కన్పించాయి- భరించలేక దిగ్గున లేచాడు- చుట్టూ అంతా తలలొంచుకుని నిలబడివున్నారు-

అంతే! ఎవరూ వూహించని విధంగా గబగబా అడుగులేసి సముద్ర మధ్యలోకి నడిచాడు- క్షణంలో సముద్ర గర్భంలో గంగన్న యిమిడిపోయాడు - కెరటాలు నురుగులు కక్కుతూ ఎగిరిపడ్డాయి!

తెల్లవారింది—

పాపాలు చేస్తూ సంఘంలో పెద్ద మనుషులుగా చెలామణీ అవుతున్నవారికీ, స్త్రీలోలురకు, వ్యభిచారులకూ, అవినీతి పరులకూ, పోలీసులకూ, భక్తులకూ, సామాన్యులకూ అందరికీ తెల్లవారింది-

విషయం తెల్సిన కొద్దిమంది 'పాపం' అంటూ సానుభూతి చూపారు.

కానీ రత్తాలిని వ్యభిచారిణి గనూ, గంగన్నను పిచ్చివాడిగనూ జమకట్టింది సంఘం *

(పురుషుడు చేసిన అన్యాయాలకు ఆహుతులైపోయిన స్త్రీమూర్తులకూ— అన్యాయాలు చేసినా మనసారా పశ్చాత్తాపం పడ్డ పురుషులకూ—
యీ కథ అంకితం

రచయిత)